# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28 -11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన మారిటైం హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **తెలంగాణలో భారతీయ జనతా పార్టీ వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.**

**3.** **మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు 'ఈగల్' పేరుతో రాష్ట్రస్థాయిలో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.**

**5** **తెలంగాణవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర కుటుంబ గణన 95 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.**

**5.** **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా ఈ రోజు రూపాంతరం చెందే అవకాశముందని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది.**

=========================

ఆంధ్రప్రదేశ్ లో నౌకాశ్రయాల తో పాటు సమీప ప్రాంతాలు అభివృద్ధి చేందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఏపీ మారిటైం పాలసీ-2024పై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన మారిటైం హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. 'నౌకల నిర్మాణంతో పాటు అనుబంధ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోర్టుల్లో సరకు, నౌకా నిర్వహణ సామర్థ్యాలు పెంచడంతో పాటు రోడ్డు, రైలు కారిడార్లను అనుసంధానించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రానికి చెందిన బిజెపి శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు ప్రధానమంత్రితో నిన్న ఢిల్లీలో సమావేశమయ్యారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితులు, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఈ సమావేశంపై ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు.'తెలంగాణ బిజెపి ప్రజా ప్రతినిధులతో సమావేశం బాగా జరిగిందని. రాష్ట్రంలో పార్టీ వేగంగా విస్తరిస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలతో విసిగిపోయారని చెప్పారు . ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాడుతుందని, కార్యకర్తలు అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

--------------------------

గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు త్వరలో 'ఈగల్' పేరుతో రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందని ఆంధ్ర ప్రదేశ్ హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం ఈగల్ టాస్క్ ఫోర్స్ విధివిధానాలతో పాటు పలు అంశాలపై చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి అనిత పాత్రికేయులతో మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికత వినియోగంతో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్యపరచి వాటి నిరోధానికి 'మహా సంకల్పం' పేరుతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల ద్వారా అవగాహన సదస్సులను నిర్వహిస్తామని మంత్రి వివరించారు

---------------------------

రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఏడాది 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ధాన్యం కోనుగోలు కోసం వాట్సప్ సేవలను అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

గోవాలో జరుగుతున్న 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ రంగ ప్రముఖులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. ఆస్ట్రేలియా దర్శకుడు రాబీ విలియమ్స్ జీవిత విశేషాలతో మైఖేల్ గ్రేసీ రూపొందించిన "బెటర్ మేన్" చిత్రంతో ప్రారంభమైన ఈ ఉత్సవం భారతీయ సినిమాకి చెందిన నలుగురు దిగ్గజ ప్రముఖులు రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా, అక్కినేని నాగేశ్వర రావుల శత జయంతి వేడుకలకు వేదిక అయ్యింది. చలనచిత్రోత్సవం ప్రారంభం నుండి, సినిమా ప్రదర్శనలకు, వివిధ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు. ఈ రోజు తో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ముగియనుంది.

---------------------------

"వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్"లో భాగమయ్యేందుకు ఆల్ – ఇండియా డిజిటల్ క్విజ్ పోటీలో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు. యువత, వారి వినూత్న ఆలోచనలను ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి అధికారులకు వినిపించేందుకు ఇది ప్రత్యేకమైన అవకాశమని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "వికసిత్ భారత్ ఛాలెంజ్" అనే నాలుగు – దశల పోటీలో యువత పాల్గొనడంతో పాటు ఆలోచనలను తెలిజేసే అవకాశం ఉంటుందని, 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు వారంతా ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు.

---------------------------

తెలంగాణవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర కుటుంబ గణన 95 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ గణనలో మొత్తం 1 కోటి 18 లక్షల 2 వేల 726 నివాసాలను ప్రభుత్వం గుర్తించగా , నిన్నటివరకు 1 కోటి 10 లక్షల 98 వేల 360 నివాసాలలో సమాచార సేకరణ పూర్తయిందని ఒక ప్రకటనలో తెలిపింది. 7 లక్షల 4 వేల 366 నివాసాల సమాచారాన్ని సేకరించాల్సి ఉందని, సేకరించిన వివరాలను జాగ్రత్తలు తీసుకొంటూ

వేగవంతంగా అధికారులు  కంప్యూటరీకరిస్తున్నారని తెలిపింది. అత్యధికంగా 70.3 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 59.8 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ స్థానంలో ఉందని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ వెల్లడించారు. విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి నిన్న విజయవాడలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా  నారాయణ మాట్లాడుతూ

వాయిస్  ( 34 సెకన్లు)

---------------------------

అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళా జనోద్ధరణకు తన యావజ్జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి  ఈరోజు. అన్ని వర్గాల  ప్రజలు అందరితో సమానంగా హక్కులను పొందడానికి సత్యశోధక సమాజాన్ని పూలే  ఏర్పాటు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంత పోరాటం చేసిన జ్యోతిరావు పూలే 1890 నవంబర్ 28వ తేదీన పూనేలో తుదిశ్వాస విడిచారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా ఈ రోజు రూపాంతరం చెందే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.  ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంక తమిళనాడుమధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది.  దీని ప్రభావంతో ఈ రోజు  నుంచి శనివారం వరకు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీర ప్రాంతాల్లో  గంటకు 75 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు శనివారం వరకు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం నౌకాశ్రయాలకు ఒకటో నంబరు ప్రమాద  హెచ్చరికలు జారీ చేశారు.

మరోవైపు తెలంగాణలో  చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో పది డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, . మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని తెలిపింది.

---------------------------

తెలంగాణలో  మిషన్ భగీరథ ద్వారా  ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన మిషన్ భగీరథ బోర్డు సమావేశం నిన్న  జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు తాగునీరు కోసం నీటి శుద్ధి కేంద్రాలు,  బోరు నీళ్లపై ఆధారపడకుండా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లను వినియోగించేలా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. నీటి నాణ్యతను ప్రజలకు వివరించేలా ప్రతీ గ్రామపంచాయతీలో ఒక రోజు సదస్సు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు  సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని  పోలవరం ప్రాజెక్టు సంబంధించిన  వివరాలన్నీ ఒక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జలవనరుల

శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను  ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో నీటి  ప్రాజెక్టుల పురోగతిపై నిన్న సమీక్షించారు.

=======================